క్లుప్తంగా

నేడు మంత్రి రోజా పర్యటన

నగరి : పట్టణ పరిధిలో మంత్రి ఆర్కేరోజా ఆదివారం పర్యటించనున్నారు. ఉదయం 9.30 గంటలకు గ్రామ దేవత శ్రీదేశమ్మ అమ్మ వారికి తిరుమల తిరుపతి దేవస్థానం తరఫున పట్టు వస్త్రాలను సమర్పించనున్నారు. అనంతరం ఆలయం వద్ద అమ్మవారికి అంబలి పోసే కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 3.30 గంటలకు నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేవీకే స్టేడియంలో నగరి చెస్ అసోసియేషన్, లైన్స్ క్లబ్ వారు నిర్వహించిన చెస్ పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తారు.

నేడు జాతర గ్రామ కూటం

పుత్తూరు రూరల్: గ్రామ దేవత గంగమ్మ జాతర నిర్వహణకు సంబంధించి పుత్తూరు రామాలయ ఆవరణలో ఆదివారం రాత్రి గ్రామ కూటం నిర్వహిస్తున్నట్లు జాతర కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పెద్దలు పాల్గొని సెప్టెంబర్ 5వ తేదీన ఆరేటమ్మ గ్రామోత్సవం, తర్వాత సెప్టెంబర్ 12, 13 తేదీల్లో పుత్తూరు పిడికిలి గంగమ్మ దేవత జాతర నిర్వహణపై గ్రామ పెద్దలు సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు.

అన్నదానం



కార్వేటినగరం: స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ ఆవరణలో తిరుపతికి చెంది ఫిజియో థెరపిస్టు డాక్టర్ బి.ఝాన్సీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఆలయ అధికారి సురేష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

డిజిటల్ చెల్లింపులతోనే మద్యం విక్రయించాలి



మద్యం దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న రామకృష్ణశాస్త్రి

శ్రీరంగరాజపురం: ప్రభుత్వ మద్యం దుకాణాలలో పనిచేసే సిబ్బంది ప్రతిరోజూ మద్యం, బీరు బాటిళ్లను కచ్చితంగావిధానంలోనే బిల్లులు స్వీకరించాలని డిపో సబ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణశాస్త్రి అన్నారు. శనివారం శ్రీరంగరాజపురం, 49కొత్తపల్లిమిట్ట, మద్యం దుకాణాల్లో ఆయన తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నిబంధనలలు పాటించని వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతిరోజూ స్టాక్ నిల్వలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. వెరిఫికేషన్ ఆఫీసర్లు నాగరాజు, జాన్సన్ పాల్గొన్నారు.

వైభవంగా పార్వేట ఉత్సవం



విశేషాలంకరణలో స్వామి అమ్మవార్లు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై ఉన్న శ్రీవళ్లీ దేవసేన సమేత కుమారస్వామి ఆడికృత్తిక ఉత్సవాలను పురస్కరించుకుని శనివారం పార్వేట ఉత్సవం వైభవంగా నిర్వహించారు. మొదట ఆలయ అలంకార మండపంలో స్వామి అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం వేద మంత్రాలు మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను చప్పరాలపై కొలువుదీర్చి, పురవీధుల్లో ఊరేగించారు. భక్తుల స్వామి అమ్మవార్లను దర్శించుకుని కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, సభ్యులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

108లో సుఖ ప్రసవం



చిత్తూరు రూరల్/గుడిపాల: పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భిణికి 108 సిబ్బంది సుఖప్రసవం చేయడంతో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. వివరాలు.. గుడిపాల మండలం వెంగమాంబపురం గ్రామానికి చెందిన మహేశ్వరికి శనివారం సాయంత్రం పురిటి నొప్పులు మొదలయ్యాయి. కుటుంబ సభ్యులు 108కు ఫోన్ చేశారు. అంబులెన్స్‌లో ఆమెను చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా చిత్తూరు మండలం పిళ్లారిమిట్ట గ్రామం వద్ద నొప్పులు అధికమయ్యాయి. దీంతో ఈఎంటీ ఆనందన్ పైలెట్ లోకేష్ సాయంతో ప్రసవం చేశారు. దీంతో గర్భిణి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. క్లిష్టతర పరిస్థితుల్లో ఆమెకు డెలివరీ చేశామని సిబ్బంది తెలిపారు. కాగా ప్రైవేట్ ఆస్పత్రిలో చూపిస్తే ఆపరేషన్ చేయాలని చెప్పారని మహేశ్వరి భర్త విల్సన్ తెలిపారు.అనంతరం తల్లిబిడ్డను చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సున్నా వడ్డీతో ఆర్థిక పురోగతి

స్వయం సహాయక సంఘాల్లోని అక్కచెల్లెమ్మల ఆర్థిక స్వావలంబనకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్ వైఎస్సార్ సున్నావడ్డీ పథకంతో ప్రోత్సహిస్తోంది. ప్రజా సంకల్ప యాత్రలో మహిళల ఆర్థిక ఇబ్బందులను చూసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమ పార్టీ అధికారంలోకి రాగానే మహిళలు తీసుకున్న రుణానికి వడ్డీ భారాన్ని ప్రభుత్వమే భరిస్తుందని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్ సున్నా వడ్డీ పథకాన్ని నవరత్నాల పథకంలో చేర్చారు. ఏటా క్రమం తప్పకుండా వడ్డీ మొత్తాలను నేరుగా స్వయం సహాయక సంఘాల అప్పు ఖాతాల్లో జమ చేస్తున్నారు. పుత్తూరు పట్టణంలో డ్వాక్రా మహిళలు 4 విడతల్లో రూ.10.84 కోట్ల లబ్ధి పొందారు. దీనిపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.

- స్వయం ఉపాధితో డ్వాక్రా మహిళల స్వావలంబన
- పుత్తూరులో 1677 స్వయం సహాయ సంఘాలు
- 4 విడతల్లో రూ. 10.84 కోట్ల లబ్ధి



పుత్తూరులో చీరల వ్యాపారం చేస్తున్న గణపతి గ్రూపు సభ్యులు

పుత్తూరులో వైఎస్సార్ సున్నా వడ్డీ పొందిన లబ్ధిదారుల వివరాలు

పుత్తూరు	సంఘాల సంఖ్య	2020-21 రూ.కోట్లలో	2021-22 రూ.కోట్లలో	2022-23 రూ.కోట్లలో	2023-24 రూ.కోట్లలో
పట్టణం	1047	1.52	1.51	1.79	2.06
రూరల్	630	1.22	1.05	1.03	0.66
మొత్తం	1677	2.74	2.56	2.82	2.72

పుత్తూరు రూరల్: పొదుపు సంఘ కార్యకలాపాలను ప్రోత్సహించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్ద ఎత్తున తోడ్పాటు అందజేస్తోంది. 2019లో వైఎస్సార్ సున్నా వడ్డీ కార్యక్రమాన్ని ప్రారంభించి క్రమం తప్పకుండా అందజేస్తూ వస్తోంది. తీసుకున్న రుణాల మొత్తాలను సకాలంలో చెల్లించిన అన్ని సంఘాలకు సున్నా వడ్డీని వర్తింపజేస్తోంది. స్వయం సహాయక సంఘాల అప్పు ఖాతాల్లోకి నగదును జమ చేస్తున్నారు. బకాయి ఉన్న సంఘాలు పూర్తిగా చెల్లించిన పిదప మాత్రమే సున్నా వడ్డీకి అర్హత పొందుతాయి. ఏనెలలో అయితే బకాయిలు పూర్తిగా చెల్లిస్తారో ఆనెలకు మాత్రమే సున్నా వడ్డీని పొందుతారు. వైఎస్సార్ సున్నా వడ్డీ కార్యక్రమాన్ని నాలుగో ఏడాది 2022-23 ఆర్థిక సంవత్సరంలో సకాలంలో చెల్లించిన అన్ని సంఘాలకు, ఆ సంవత్సరం తీసుకున్న కొత్త రుణాలకు సైతం సున్నా వడ్డీ రుణాలను విడుదల చేసింది. సంఘం అప్పు నిల్వలో గరిష్ఠంగా రూ.3 లక్షల వరకు మాత్రమే సున్నా వడ్డీ వర్తిస్తుంది. ఈ పథకం కింద గడచిన నాలుగేళ్లలో పుత్తూరు పట్టణ పరిధిలోని 1047 సంఘాలకు గాను గడచిన నాలుగేళ్లలో సున్నా వడ్డీ కింద రూ.6.88 కోట్లు లబ్ధి చేకూరింది. పుత్తూరు రూరల్ మండల పరిధిలోని 630 సంఘాలకు రూ. 3.96 కోట్లు లబ్ధి చేకూరింది. ప్రభుత్వం అందిస్తున్న చేయూతతో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెంది వారి కుటుంబాలతో సంతోషంగా ఉన్నారు.

జగనన్న మేలు మరువం



మహిళలను ఆర్థికంగా ఆదుకుంటున్న సీఎం జగనన్న మేలు ఎప్పటికీ మరువలేం. గత ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదు. జగనన్న చెప్పిన దానికన్నా ఎక్కువ చేస్తున్నారు. గత ప్రభుత్వంలోని డ్వాక్రా రుణాలను మాఫీ చేయడంతో పాటు సున్నా వడ్డీని అమలు చేయడం ద్వారా మాకు ఎంతో మేలు జరుగుతోంది. మా గ్రూపునకు రూ.21 వేల సున్నా వడ్డీ లభించింది. జగనన్న సాయంతో నేను కొయ్యల వ్యాపారం చేసుకొంటున్నా.

– ఏ.శివగామి, లక్ష్మి గ్రూపు, కేబీఆర్‌పురం, పుత్తూరు

మహిళా పక్షపాత ప్రభుత్వం



వైఎస్సార్‌సీపీ మహిళల పక్షపాత ప్రభుత్వం. అందుకే ప్రతి పథకాన్ని మహిళల పేరిట అమలు చేస్తున్నారు. వైఎస్సార్ సున్నా వడ్డీ కింద మా గ్రూపునకు రూ.21 వేలు వచ్చింది. ఇలా అందుకోవడం నాల్గోసారి. నేను చీరల వ్యాపారం చేసుకుంటూ ఆర్థికంగా ఎదుగుతున్నాను. జగనన్న ప్రభుత్వానికి మా కుటుంబం రుణపడి ఉంటుంది

– బి.మంజుల, గణపతి గ్రూపు, తడుకు

సంఘాలు ఆర్థికాభివృద్ధి



ప్రభుత్వం సంఘాల కోరిన మేరకు రుణ సదుపాయం కల్పించడమే కాకుండా వడ్డీ భారాన్ని తగ్గించింది. గత ప్రభుత్వంలో 12 శాతం నుంచి 13.5 శాతం వరకు వడ్డీ ఉండేది. ప్రస్తుతం రూ.3 లక్షల నుంచి 5 లక్షల వరకు 8.5 శాతం, రూ.5 లక్షల నుంచి 20 లక్షల వరకు కేవలం 9.5 శాతం మాత్రమే వడ్డీ ఉంది. ఫలితంగా సంఘాలు ఆర్థికాభివృద్ధిని సాధిస్తున్నాయి.

– డీవీ సుబ్బారెడ్డి వెలుగు ఏపీఎం, పుత్తూరు

వైభవంగా కరియమాణిక్యస్వామి ఊంజల్ సేవ



ఊంజల్ సేవలో పాల్గొన్న భక్తులు



ఊంజల్‌సేవ నిర్వహిస్తున్న అర్చకులు

గతంలో ఆగిన సేవ మళ్లీ పునరుద్ధరణ

నగరి : పట్టణ పరిధిలో తిరుమల తిరుపతి దేవస్థానం అనుబంధంలో ఉన్న శ్రీకరియమాణిక్యస్వామి ఆలయంలో శనివారం ఊంజల్‌సేవ వైభవంగా నిర్వహించారు. గతంలో నిర్వహిస్తూ వచ్చిన ఈ సేవ తదుపరి ఆగిపోయింది. మళ్లీ ఆలయంలో ఊంజల్ సేవ నిర్వహించాలన్న కోరిక స్థానిక భక్తుల్లో బలంగా ఉండేది. ప్రస్తుతం వారి ఆశలు నెరవేరాయి. టీటీడీ అధికారులు ఊంజల్‌సేవ నిర్వహణకు పచ్చజెండా ఊపారు. దీంతో శనివారం శ్రీదేవి, భూదేవి సమేత కరియమాణిక్యస్వామికి ఊంజల్ సేవ నిర్వహించారు. నేత్ర పర్వంగా జరిగిన ఊంజల్ సేవలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తిలకించి పులకించారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ రమేష్, ఆలయ అధికారి వెంకటరమణ, గుణశేఖర్, ప్రధాన అర్చకులు దన్వంత్రి ఆచార్యులు, నరసింహ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంచెలంచెలుగా మీరాసాహెబ్‌పాళెం అభివృద్ధి



కాలువలను పరిశీలిస్తున్న రాంప్రసాద్‌రెడ్డి, అధికారులు

నగరి : మండలంలో మంత్రి ఆర్కేరోజా దత్తత తీసుకున్న మీరాసాహెబ్ పాళెంలో అంచెలంచెలుగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే గ్రామంలో సిమెంటు రోడ్లు, వీధి దీపాలు ఏర్పాటు చేశారు. ఇంటి స్థలాలు లేనివారికి స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇస్తున్నారు. మెడికల్ క్యాంపులు ఏర్పాటుచేసి ఉచిత వైద్యసేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం మురుగు కాలువల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందులో భాగంగా కాలువలు నిర్మించాల్సిన ప్రదేశాలు, మురుగు సుదూర ప్రాంతాలకు తరలించడానికి తీసుకోవలసిన చర్యలను మంత్రి ఆర్కేరోజా సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి అధికారులు, ప్రజాప్రతినిధులతో వెళ్లి శనివారం ప్రత్యక్షంగా పరిశీలించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈతో మాట్లాడుతూ కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఉన్న మురుగు కాలువలు శిథిలావస్థకు చేరుకోవడంతోపాటు పక్కాగా నిర్మిస్తామని అన్నారు. ఆర్మీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు ఇమ్రాన్‌ఖాన్, సర్పంచ్ నందిని, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శ్రద్ధ పెట్టాలి



రైతులతో మాట్లాడుతున్న డీపీఎం వాసు



వేరు శనగ పంటను పరిశీలిస్తున్న ఏఓ

పాలసముద్రం: మండలంలోని రైతులు ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని చిత్తూరు ఏపీపీఎస్ఎఫ్ డీపీఎం వాసు తెలిపారు. శనివారం క్రిష్ణజమ్మపురంలో రైతులకు ప్రకతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వాసు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో చెరకు పంట సాగుచేసి బెల్లం తయారీ చేస్తే బెల్లంను టీటీడీకి సరఫరా చేస్తామని, రైతులకు మార్కెట్ ధర కన్నా ఐదు శాతం ఎక్కువ ధరకు టీటీడీ కొనుగోలు చేస్తుందని తెలిపారు. అంతువల్ల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంతో సాగు చేసిన చెరుకు పంటను క్షేత్రస్థాయిల్లో పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ రైతులు షణ్ముగరెడ్డి, మణిగండన్ పాల్గొన్నారు.

రైతన్నలు మెలకువలు పాటించాలి

పాలసముద్రం: రైతన్నలు వరి, వేరుశనగ సాగులో మెలకువలు పాటించాలని వ్యవసాయాధికారి ఢిల్లీ ప్రసాద్ తెలిపారు. శనివారం సీఎం కండ్రిగలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. రైతులతో ఏఓ మాట్లాడుతూ వరి, వేరుశనగ పంటకు సేంద్రియ ఎరువులు విరివిగా వాడాలని సూచించారు. నేల సారవంతంగా ఉంటే పంట అధిక దిగుబడి సాధించవచ్చని తెలిపారు. సాగు చేసిన వరి పంటను క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించారు. వ్యవసాయ సహాయకులు వనజ, రైతులు పాల్గొన్నారు.

వేడుకగా ఏకాదశి ఉత్సవం



తిరుచ్చిపై విహరిస్తున్న కల్యాణ వెంకన్న

నారాయణవనం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధంలో ఉన్న ప్రముఖ శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఏకాదశి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేతంగా కల్యాణ వేంకటేశ్వరస్వామి తిరుచ్చి వాహనం అధిరోహించి మాడ వీధుల్లో విహరించారు. ఉదయం సుప్రభాత సేవతో నిత్యపూజా కైంకర్యాలను నిర్వహించారు. ఏకాదశి గడియల్లో అర్చనలు చేసి ధూప, దీప నైవేద్యాలను సమర్పించారు. శనివారం కావడంతో భక్తులు ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. అర్చకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. సాయంత్రం కైంకర్యాల అనంతరం తిరుచ్చి వాహనంపై ఉభయ నాంచారుల సమేతంగా కల్యాణ వెంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు మాడ వీధుల్లో కొనసాగింది. భక్తులు అడుగడుగునా హారతులు సమర్పించారు. ఆలయ అధికారి నాగరాజు. సహాయకులు షనాయి, భద్రతా జమేదార్ రాజకుమార్ పర్యవేక్షించారు.

శ్రీవేదనారాయణస్వామి ఆలయంలో..

నాగలాపురం : మండల కేంద్రంలో టీటీడీ అనుబంధంలో ఉన్న శ్రీవేదవల్లి సమేత వేదనారాయణ స్వామి ఆలయంలో ఏకాదశి శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. అభిషేక పూజలు అనంతరం సుందరంగా శ్రీస్వామి, అమ్మవార్లను సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. సాయంత్రం ఉత్సవ మూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి ఊయలలో కొలువుదీర్చి ఊంజల్ సేవను వేడుకగా నిర్వహించారు. భక్తులు వీక్షించి తరించారు.

ఘనంగా ఆరుద్ర పూజలు



విశేష అలంకరణలో మహాశివుడు

పుత్తూరు రూరల్: వడమాలపేటలోని శ్రీభవానీ శంకరస్వామి ఆలయంలో శనివారం మహాశివుని జన్మ నక్షత్రమైన ఆరుద్ర సందర్భంగా మహా రుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఉదయం మహాలింగానికి వేదమంత్రాల నడుమ పంచామృతాభిషేకాన్ని చేపట్టారు. వేద పండితులు రుద్ర గమకాలు పటిస్తూ భక్తుల శివ నామ స్మరణల నడుమ మహారుద్రాభిషేకాన్ని కనుల పండుగగా నిర్వహించారు. అనంతరం అర్చకులు శివ, సాయిల నేతృత్వంలో స్వామి వారిని సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు, కల్లూరు గ్రామానికి చెందిన సుధాకర్‌రెడ్డి దంపతులు భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి శనివారం పాకాల మండలం పార్వేటిపల్లెకు చెందిన వి.కుమారస్వామి, కుటుంబ సభ్యులు కౌశల్‌కుమార్ పేరిట రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ సొమ్మును పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వీకరించారు. దాతకు కృతజ్ఞతలు తెలిపి స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ధ్వజావరోహణంతో ముగిసిన ఆడికృత్తిక ఉత్సవాలు



ప్రత్యేకాలంకరణలో స్వామివారు



ధ్వజావరోహణం చేస్తున్న వేద పండితులు

కార్వేటినగరం: స్కంధ పుష్కరిణీ సమీపంలో కుమారగిరిపై వెలసి ఉన్న శ్రీవళ్లీ,దేవ సేన సమేత శ్రీసుబ్రమణ్యస్వామి ఆలయ వార్షిక ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు ఐదోరోజు శనివారం ధ్వజావరోహణంతో పరిసమాప్తమయ్యాయి. తెల్లవారుజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి అభిషేకపూజలు, అలంకరణలు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో విచ్చేసిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం వేదోక్తంగా ధ్వజావరోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. చివరి రోజు కూడా భక్తులు కావళ్లతో వచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించారు. భక్తులకు ఆలయ కమిటీ అధ్యక్షుడు కె.కేశవరెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు తీర్థప్రసాదాలను అందించారు. దేవదాయశాఖ ఈఓ కృష్ణనాయక్, ఆలయ కమిటీ సభ్యులు పయణిరెడ్డి, కుప్పారెడ్డి, కుమారాచారి, జయమ్మ, రేవతి, హరికుమార్ పలువురు పాల్గొన్నారు.

అట్టహాసంగా నా భూమి- నా దేశం



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న సర్పంచ్ నగేషం

రేణిగుంట: ఆజాదీకా అమృత్ వారోత్సవాల్లో భాగంగా 'నా భూమి- నా దేశం' కార్యక్రమం శనివారం రేణిగుంటలో ఘనంగా నిర్వహించారు. రేణిగుంట, వెంకటాపురం, గాజులమండ్యం, విప్పమానుపట్టెడ, ఎల్లమండ్యం పంచాయతీల్లో 'నా భూమి- నా దేశం' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉపాధి హామీ పథకం డ్వామా జిల్లా ఏపీడీ సరిత ముఖ్య అతిథిగా విచ్చేసి ఆయా పంచాయతీలలో 'నా భూమి- నా దేశం' శిలాఫలకాలను ఆవిష్కరించారు. నేలతల్లికి నమస్కారం, అమరవీరులకు వందనం కార్యక్రమాలను చేపట్టారు. జాతీయ పతాకాన్ని చేతపట్టి దేశ సమగ్రతను కాపాడుతామంటూ అందరూ ప్రతిజ్ఞ చేశారు. ప్రతి పంచాయతీలో 75 చెట్లు చొప్పున నాటారు. సరిత మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశం లౌకిక రాజ్యంగా విరాజిల్లుతూ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ప్రతి భారతీయ పౌరునిలో స్వాతంత్ర పోరాట స్ఫూర్తిని నింపడమే కాకుండా వారిలో సమాజం పట్ల బాధ్యత, దేశభక్తిని పెంపొందించే విధంగా గ్రామాల్లో 'నా భూమి- నా దేశం' కార్యక్రమం చేపట్టాలన్నారు. మండలంలోని విప్పమానుపట్టెడలో మహిళలు మట్టి ప్రమిదలను వెలిగించి స్వాతంత్ర సమర యోధులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు నగేషం, గంగారి రమేష్, లక్ష్మీపతిరెడ్డి, ఉపాధిహామీ పథకం ఏపీఓ జ్యోతిశ్రీ, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి జువ్వల దయాకర్‌రెడ్డి, రేణిగుంట బాలికోన్నత పాఠశాల హెచ్ఎం విష్ణువర్ధనం, టెక్నికల్ అసిస్టెంట్లు లీల, మల్లేశ్వరి, ఈసీ జయంతి, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


అంతర పంటలతో అధిక ఆదాయం



నారు మొక్కలను పంపిణీ చేస్తున్న కేవీకే ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాసులు

రేణిగుంట: మామిడి తోటల్లో అంతర పంటల సాగుతోఅధిక ఆదాయం పొందవచ్చని రాస్ కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ వనస్థలిలోని రాస్ కృషి విజ్ఞానకేంద్రంలో శనివారం రైతులకు మామిడిలో అంతర పంటల సాగుపై శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ సంవత్సరం లోపు వయస్సు ఉన్న మామిడి తోటలో ఖరీఫ్ సీజన్‌కు అనుకూలమైన కూరగాయలు, పూలమొక్కలు పెంపకం చేపడితే ఎకరాలకు రూ.50వేలు నుంచి రూ.60వేలు వరకు అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. మామిడి అంతర పంటల సాగుపై క్షేత్ర ప్రదర్శనల నిమిత్తం బెంగుళూరు ఐఐహెచ్‌ఆర్ వారు రూపొందించిన టమోటా 'అర్క సామ్రాట్' రకం, మిరప అర్క హరిత, ఉల్లి ఎన్ఎస్-53, బంతి అర్క అభి వంటి మేలు జాతి వంగడాలకు చెందిన నారు మొక్కలను రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ సుధాకర్, వివిధ మండలాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా గరుడసేవ



గరుడవాహనంపై విహరిస్తున్న శ్రీకృష్ణుడు

నారాయణవనం: మండల కేంద్రంలోని శ్రీధర్మరాజులస్వామి ఆలయ మహాభారత ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం గరుడ వాహనాన్ని అధిరోహించి శ్రీకృష్ణుడు పుర వీధుల్లో విహరించారు. ఉదయం శ్రీసొరకాలస్వామి ఆలయం నుంచి అలుగు ఉత్సవం ప్రారంభమైంది. అలుగుకుండను పుష్పాలతో సుందరంగా అలంకరించి ఊరేగింపుగా ధర్మరాజులస్వామి ఆలయానికి తీసుకువచ్చారు. ఎలాంటి ఆధారం లేకుండా కుండలో కత్తిని నిలిపి ప్రత్యేక పూజలను చేపట్టారు. సాయంత్రం గరుడ వాహనంపై శ్రీకృష్ణుని ఉత్సవ మూర్తిని కొలువుదీర్చి ఊరేగించారు. మంగళవాయిద్యాలు, డీజే మ్యూజిక్‌కు అనుగుణంగా కళాకారుల నృత్యాల నడుమ ఊరేగింపు నయనానందకరంగా జరిగింది. రాత్రి 11 గంటలకు స్వామి వారి వాహనం ఆలయానికి చేరుకుంది. ఎస్ఐ పరమేష్ నాయక్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. ఆదివారం సాయంత్రం అగ్నిగుండ ఉత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త సొరకాయలు రెడ్డి తెలిపారు. అగ్నిగుండ ప్రవేశం చేసే భక్తులు ఆలయంలో రుసుం చెల్లించి టోకన్‌ను విధిగా ధరించాలని సూచించారు.